ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 28 ఫిబ్రవరి 2024

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి 8

కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి 8



సంక్షోభంలో నేతన్నలు

- రోడ్డున పడిన బతుకులు
- సగానికిపైగా ఆగిన మరమగ్గాలు
- ప్రభుత్వ ఆర్డర్లకోసం ఎదురుచూపులు
- పేరుకుపోయిన బకాయిలు
- ఇంకా అందని బతుకమ్మ చీరల ఆర్డర్లు
- నేడు 'నేతన్నల ఆకలికేక' మహాధర్నా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పోగూపోగు పేని రంగు రంగుల బతుకమ్మ చీరలు నేసిన నేతన్నలు మళ్లీ పనికోసం ఎదురు చూస్తున్నారు. ఆధారం చూపిన రంగు రంగుల జరీ పోగులు మరమగ్గం చాటున నేతన్నలను వెక్కిరిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆడపడుచులకు అందించిన బతుకమ్మ చీరలతోపాటు ఇతర శాఖల ప్రభుత్వ ఆర్డర్లతో చేతి నిండా పని దొరికింది. ప్రభుత్వం మారడంతో ఆర్డర్లపై అయోమయం నెలకొంది. సర్వశిక్ష అభియాన్ ద్వారా కొద్దిమేరకు యూనిఫాం బట్ట ఉత్పత్తి ఆర్డర్లు వచ్చినా పూర్తి స్థాయిలో పనిదొరకని పరిస్థితి. సిరిసిల్లలోని 35 వేల మరమగ్గాల్లో సగానికిపైగా అంటే దాదాపు 20 వేల మగ్గాలపై బట్ట ఉత్పత్తిలేక నిలిచిపోయాయి. కొత్త ఆర్డర్లు మాట ఎలా ఉన్నా కనీసం గత ప్రభుత్వ హయాంలో రావాల్సిన దాదాపు రూ.200 కోట్ల బకాయిలూ విడుదల కాలేదు. మరోవైపు దేశంలోనే టెక్స్‌టైల్ రంగం సంక్షోభంలో ఉండడంతో సిరిసిల్లలో ఉత్పత్తి అయ్యే పాలిస్టర్ బట్ట కొనుగోళ్లు లేక దాదాపు రూ.20 కోట్ల మేర బట్ట నిల్వలు పేరుకుపోయాయి. వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

● వీధిన పడుతున్న కార్మికులు

సిరిసిల్ల నేతన్నలు మరోసారి సంక్షోభంలో చిక్కి పనికోసం వీధిన పడారు. సిరిసిల్లలో దాదాపు 35 వేల మరమగ్గాలు ఉండగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. గడిచిన నెల రోజులుగా మరమగ్గాలు మూతపడుతున్న దశలో కార్మికులు మళ్లీ వీధి వ్యాపారాల పైన పడ్డారు, రోడ్లపై కూరగాయలు, ప్లాస్టిక్ వస్తువులు, తినుబండారాలు విక్రయిస్తున్నారు. కొందరు రోజువారీ కూలీ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

● నేడు నేతన్నల ఆకలికేక మహాధర్నా

సిరిసిల్ల నేత కార్మికులకు పని కల్పించాలని, వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్లలో 'నేతన్నల ఆకలి కేక' మహాధర్నా చేపట్టనున్నారు. మరమగ్గాల కార్మికులతో అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. పవర్‌లూం, వార్పిన్, ఆసాములు, గుమాస్తా, జాఫర్, మినీస్టోర్, జోటా రిపేర్, ఆటో హమాలీ కార్మిక సంఘాలు మహాధర్నాలో పాల్గొననున్నాయి. మహాధర్నాకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ హాజరుకానున్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లతోపాటు బకాయిలు విడుదల చేయాలని, అన్ని రకాల సబ్సిడీ డబ్బులు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

● నేతన్నల పస్తులకు ఎవరు కారణం?

అనేక ఒడిదుడుకుల మధ్య సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ముందుకు సాగింది. సంక్షోభాలు తలెత్తినా రెండు మూడు నెలల్లోనే మళ్లీ నిలదొక్కుకోవడం, ముందుకు సాగడం వంటి సందర్భాలు ఉన్నాయి. ఆత్మహత్యలు, ఆకలి చావులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిరిసిల్ల కుదిపేసింది. సిరిసిల్లలో మూడంచెల వ్యవస్థగా గతంలో కొనసాగేది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలతోపాటు హైదరాబాద్‌కు చెందిన బడా వ్యాపారులు నూలు కొనుగోలు చేసి సిరిసిల్లలోని మాస్టర్ వీవర్‌లు (వార్పిన్ యజమానులు) భీములుగా మార్చి మరమగ్గాల అసాములకు అందించేవారు. వారు కార్మికుల ద్వారా బట్ట ఉత్పత్తి చేసి తిరిగి వార్పిన్ యజమానులకు అక్కడి నుంచి బడా వ్యాపారులకు బట్ట వెళ్లేది. దేశంలో ఉన్న మార్కెట్‌కు అనుగుణంగా పాలిస్టర్ ఉత్పత్తులు సిరిసిల్లలో జరిగేవి. ఉత్పత్తుల్లో మార్పులు లేకపోవడం, తరచూ నూలు, రసాయనాల ధరలు పెరగడం వంటి రకరకాల కారణాలతో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనేది. భారీగా పాలిస్టర్ బట్ట నిల్వలు పేరుకుపోయే క్రమంలో మరమగ్గాలు మూతపడడం, కార్మికులు ఆత్మహత్యలకు గురికావడం వంటివి కనిపించేవి. సమ్మెలు, ఆందోళనలు కొనసాగుతూ సిరిశాల, ఉరిసిల్లగా మారేది. ఈ పరిస్థితుల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నిరంతరం పని ఉండే విధంగా ఆర్డర్లను అందించింది. దీంతో కొంత మేరకు నేతన్నలకు పనిసమస్య తీరడంతోపాటు ఉపాధి ఆశాజనకంగా మారింది. కానీ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఉత్పత్తి కోసం ఏటా రూ.350 కోట్ల వరకు ఖర్చు చేసినా చీరల ఉత్పత్తిపై విమర్శలనే ఎదుర్కొంటూ వచ్చింది. ఇదే క్రమంలో పూర్తిగా పరిశ్రమ ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది. సిరిసిల్లకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ఆర్డర్లు పూర్తిగా నిలిచిపోయాయి. వస్త్ర పరిశ్రమ యజమానులు సొంత మార్కెట్‌ను కోల్పోయారు. ప్రభుత్వం కూడా బట్ట ఉత్పత్తిలో మార్పులు తీసుకురాకపోవడం, ఇతర ఆర్డర్లు ఉత్పత్తి చేసే అవకాశం కూడా ఇవ్వకపోవడం, బతుకమ్మ చీరలు, విద్యార్థుల యూనిఫాంలు, ఇతర శాఖల ఆర్డర్లు ఇవ్వడం వంటి పరిణామాలతో సొంత ఉత్పత్తులనే మర్చిపోయారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లు ఉత్పత్తులను మ్యాక్స్ సొసైటీలు, ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు ఆర్డర్లు ఇచ్చినా గత ప్రభుత్వంలోని కొద్దిమంది చేతుల్లోకే బట్ట ఉత్పత్తి వెళ్లిపోయింది. మళ్లీ కార్మికులు మాస్టర్ వీవర్‌లపైనే ఆధారపడ్డారు. కొద్దిగా మారినా మళ్లీ మూడంచెల వ్యవస్థనే ముందుకొచ్చింది. బడా వ్యాపారుల స్థానంలో ప్రభుత్వ ఆర్డర్లు ఉండగా ఉత్పత్తి రంగంలో మాస్టర్ వీవర్‌లు, మరమగ్గాల ఆసాములు ఉండిపోయారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు బతుకమ్మ చీరల ఆర్డర్ల ఊసే ఎత్తడం లేదు. ప్రభుత్వ ఆర్డర్లు సిరిసిల్లకు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా ఎప్పుడు వస్తాయనే అంశంపై సందిగ్ధం నెలకొంది. మరోవైపు గతంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్ల బకాయిలు రూ.200 కోట్ల కోసం కాంగ్రెస్ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు

వేములవాడ, ఫిబ్రవరి 27 : వేములవాడ పట్టణం, అర్బన్ రూరల్ మండలాకు ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్డీఎఫ్) నుంచి రూ.3 కోట్ల 1 లక్ష రూపాయలు విడుదలైనట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్ల నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో వేములవాడ పట్టణ పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.కోటి 33 లక్షలు మంజూరయ్యాయని వెల్లడించారు. వేములవాడ అర్బన్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో కుల సంఘాలు, మహిళా సంఘాల భవనాలు, తాగునీటి కోసం బోరు బావులకు, మోటార్లకు ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం రూ.97.10 లక్షలు, వేములవాడ రూరల్ మండల పరిధిలో రూ.71 లక్షల నిధులు మంజూరయ్యాయని వివరించారు.

చందుర్తి: చందుర్తి మండలంలో అభివృద్ధి పనుల కోసం రూ.1.04 కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రానికి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక నిధులు కేటాయించారు. రూ.59 లక్షల నిధులను మంజూరు చేయడంతో కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

సిరిసిల్ల రూరల్/వీర్నపల్లి, ఫిబ్రవరి 27 : మండలంలోని అన్ని గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది పని చేయాలని ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు రజిత అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామం టీబీ రహిత గ్రామ పంచాయతీగా ఎంపికవడంతో గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. గత సంవత్సరంలో 60 మందికి టీబీ టెస్టులు చేయగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. ప్రతీ గ్రామంలో టీబీ కేసులు లేకుండా చూడాలన్నారు. ప్రజలు టీబీ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు శ్రీరాములు, మెడికల్ ఆఫీసర్ డాక్టరు స్రవంతి, డీపీపీఎం బిగిందర్, ఎస్‌టీఎస్ మహిపాల్, ఎస్‌టీఎల్‌ఎస్ నాగరాజు, నోడల్ సూపర్‌వైజర్ పద్మ, గ్రామ సూపర్‌వైజర్ మేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ అధికారి డాక్టర్ శ్రీరాములు కోరారు. జిల్లాలో టీబీ ముక్త్ గ్రామాలుగా సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్, కోనరావుపేట మండలం శివంగళపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం కంచర్ల గ్రామాలను ఎంపిక చేశారు. మంగళవారం జిల్లా వైద్య బృందం ఆ గ్రామాలను సందర్శించింది. టీబీ రోగులకు సంబంధించిన రికార్డులను పరిశీలించింది. గ్రామ పంచాయతీల ప్రతిపాదనలను జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి పంపుతామని, ఎంపికైన గ్రామాలకు అవార్డులు అందజేస్తామని శ్రీరాములు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్నేహ, డీపీపీఎం గిరిధర్, పీఎస్‌సీ రాజ్‌కుమార్, టీబీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సర్దాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ శ్రీరాములు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27:చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం విద్యానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో అన్ని చట్టాలు తెలిసి ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా బాలికలు, మహిళల రక్షణకు అవసరమైన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కోర్టులలో ఉచిత న్యాయ సేవలను పొందాలన్నారు. లోక్ అదాలత్ సభ్యులు చింతోజి భాస్కర్, న్యాయవాదులు పర్శరాములు, వేణు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.600 కూలీ చెల్లించాలి

కోనరావుపేట, ఫిబ్రవరి 27 : ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజుకు 600 రూపాయల కూలీ చెల్లించాలని సీపీఎం మండల అధ్యక్షురాలు జవ్వాజి విమల అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో ఉపాధి పని చేస్తున్న కూలీలను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కలీల సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కూలీ డబ్బులు సరిపోవడం లేదని, ఒక్కొక్కరికి రోజుకు 600 రూపాయలు చెల్లించాలని అన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 27: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం జాతీయ సైన్స్‌దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. సైన్స్ అభ్యసించిన విద్యార్థులకు చక్కని భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, సెక్టోరియల్ అధికారి శైలజ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, పావని, తిరుపతి, ఎంఎన్‌వో శ్రీనివాస్, మహేష్‌చంద్ర, యాద రవి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: సైన్స్‌తో మానవడ మనుగడ ముడిపడి ఉందని ముస్తాబాద్ మండల ఎంపీడీవో భాస్కరశర్మ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శన నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నిమ్మ రాజిరెడ్డి, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి

గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ సంబరాలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 27 : ఆరు గ్యారెంటీల్లో మరో రెండు అమలులో భాగంగా ముస్తాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, నర్సింలు, కిషన్‌రావు, యాదగిరిగౌడ్, గాంత రాజు, రంజాని నరేశ్, విజయ్‌రెడ్డి, రాంరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): ఆరుగ్యారెంటీల్లో గృహజ్యోతి, 200యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి తేవడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాచర్ల గొల్లపల్లి కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరా భిషేకం చేశారు. కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్య క్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న చైర్‌పర్సన్, నాయకులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 27: విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని, పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు అన్నారు. 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ బాలిక ఉన్నత పాఠశాల, శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ పంపిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, కౌన్సిలర్‌లు వెల్దండి దేవదాస్, గెంట్యాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి సబ్బని హరీష్, సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కేటీఆర్ పంపించిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను మంగళవారం ఎంపీపీ పడిగెల మానస రాజు, నాయకులు అంద జేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయ కులు పెద్దూరి తిరుపతి, హెచ్‌ఎం శంకర్ నారాయణ, కందుకూరి రామ గౌడ్, జగన్, హమీద్, రమేశ్, శహేదా బేగం, భానుమూర్తి, అనిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష ప్యాడ్లను అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి

సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. నిమిషం నిబంధన ఉండడంతో పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి మోహన్ తెలిపారు. పరీక్షల కోసం 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 330 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఈ నెల 19వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులకు మానసికంగా ఇబ్బంది కలగకుండా టెలీమానస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్లు 14416, 18009144160తో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 9440599965 హెల్ప్ లైన్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు.

రేపాకలో వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 27: మండలంలోని రేపాకలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ఎక్కువ మందిలో జాండీస్ లక్షణాలు ఉన్నాయనే నేపథ్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి 31 మంది రాగా 18 మందిలో జాండీస్ లక్షణాలు కనిపించాయని వైద్యసిబ్బంది తెలిపారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, జంక్‌ఫుడ్, మద్యానికి దూరంగా ఉండాలని ఇంటింటికీ వెళ్లి సూచించారు. నీటిని క్లోరినేషన్ చేయాలని ప్రత్యేకాధికారిని కోరారు. వైద్యాధికారి సుమన్, ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం, వైద్య సిబ్బంది వెంకటరమణ, ప్రసాద్, లలిత, నయిం, జయ, పద్మ, మమత, గిరధర్, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నలింగాపూర్ చేరిన రంగనాయక సాగర్ జలాలు



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, ప్రజాప్రతినిధులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 27: రంగనాయక సాగర్ జలాలు కాలువ ద్వారా దాచారం చెరువు నిండి తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌కు చేరుకున్నాయి. దీంతో స్థానిక ఎంపీటీసీ భైరినేని రాముతో పాటు రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్యాక్స్ డైరెక్టర్ మంద నారయణ, నాయకులు గుర్రం రవీందర్, బొలవేని అనిల్, విఠల్, వెంకటేశ్, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్ యాదవ్, బాలయ్య, బాలరాజు, రాంచంద్రం, అంజీ, ప్రసాద్, తిరుపతి, పిట్ల బాలయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ కిట్లను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 27: యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ అన్నారు. నాగాయపల్లి గ్రామంలో క్రీడాకారులకు మంగళవారం వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు క్రీడల్లో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రొండి రాజు, పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారు చేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



బద్ది పోచమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ప్రజల బాగోగులు తెలుసుకునేందుకే బీజేపీ యాత్ర

తిమ్మాపూర్, ఫిబ్రవరి27: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల బాగోగులు తెలుసుకోవడం కోసమే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేపట్టారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో మార్చి 2 నుంచి జరగబోయే యాత్రకు సంబంధించి తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎంపి బండి సంజయ్ చేస్తున్న ప్రజాహిత యాత్రపై రాళ్ల దాడి చేసిన కాంగ్రెస్ నాయకుల చిల్లర బుద్ధులను ప్రజలు గమనిస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్ మాటలను వక్రీకరించి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు.

రైల్వే ప్లాట్ ఫాంపై వ్యక్తి మృతి

జమ్మికుంట,ఫిబ్రవరి27: జమ్మికుంట రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు.రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన ఔట్‌పేషెంట్ చీటి ఉందని అందులో అతడి పేరు సాగర్ తండ్రి జితేందర్ అని ఉన్నట్లు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. బ్లూ కలర్ ఫుల్ షర్ట్ దానిపై పసుపు రంగు నిలువు గీతల డిజైన్ బ్లాక్ లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్ళకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్‌ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కారని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్‌ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెర లేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

నకిలీ డాక్యుమెంట్ల కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27: నకిలీ డాక్యుమెంట్లతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో చిట్యాల కిష్టమ్మ(75)ను మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జైలుకు తరలించినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ నెల 20న కొత్తపల్లికి చెందిన కనుకారెడ్డి ఫిర్యాదుతో నందెల్లి మహిపాల్‌తో పాటు 9 మందిపై నమోదైన కేసులో ఏ1 కిష్టమ్మను అరెస్టు చేశామని తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు చేయూత అందించాలి

●రాష్ట్ర ఏయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: హెచ్‌ఐవీ బాధితులకు చేయూత అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి అన్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలకు ఇండెక్స్ పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జాతీయ ఏయిడ్స్ నియంత్రణ సంస్థ విభాగాల డాక్టర్లతో పాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఐసీటీ, పీపీటీసీటీ, డీఎస్‌ఆర్‌సీ, ఏఆర్‌టీ కేంద్రాల కౌన్సిలర్లు, డాక్టర్లు, ఎన్‌జీవో ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. రిస్క్ గ్రూపు వారిని గుర్తించి, ఏఆర్‌టీ మందులను సక్రమంగా అందించాలని సూచించారు. ఎన్‌ఏసీపీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీ సాక్స్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్లు కరుణశ్రీ, మేఖల, అసిస్టెంట్ డైరెక్టర్ ఇందిరా, సేతు మాధవ్, కన్సల్టెంట్ డాక్టర్లు డాక్టర్ పార్థసారధి, డాక్టర్ లేహార్‌వాణి, డీటీసీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి, డీఏపీసీయూ మేనేజర్ సురేందర్‌రెడ్డి, పీఆర్ శ్రీనివాస్, సురేందర్, సుమన్, రమేశ్, శ్రీనివాస్, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఒకరి రిమాండ్

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27: భూమి కొనుగోలు విషయంలో తప్పించుకొని తిరగడంతో పాటు కులం పేరుతో దూషించిన సంఘటనలో గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన నర విద్యాసాగర్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఈ ఘటనపై మంగళవారం డీఎస్పీ భీమ్‌శర్మ విచారణ చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన భూక్య నరేష్ నాగంపేటకు చెందిన విద్యాసాగర్‌రెడ్డి దగ్గర రూ.47 లక్షలకు భూమి కొనుగోలు చేసి 15 లక్షలు చెల్లించారు. నరేష్ మిగతా డబ్బులు చెల్లించేందుకు విద్యాసాగర్ రెడ్డికి ఫోన్ చేసినా స్పందించకుండా తప్పించుకొని తిరగడంతో సోమవారం కనిపించాడు. నరేష్ మిగతా డబ్బులు చెల్లిస్తా నా భూమి ఎక్కడ ఉందో చూపించమంటూ అడగడంతో కులం పేరుతో విద్యాసాగర్‌రెడ్డి ఆయనను దూషించారు. కులం పేరుతో దూషించడంతో నరేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. నరేష్ ఫిర్యాదుతో కులం పేరుతో దూషించిన విద్యాసాగర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడు మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: గోదావరిఖని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని డ్రైన్‌లో మంగళవారం రాత్రి పూరెళ్ల సాగర్(35) అనే వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక మిలీనియం క్వార్టర్స్‌లో నివాసముండే సాగర్ జీడీకే 1ఇంక్లైన్‌లో పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో సింగరేణి ఆసుపత్రిలో చేరిన ఆయన శుక్రవారం నుంచి కనబడడం లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కొంత కాలంగా కుటుంబ వివాదాలతో భార్య కాపురానికి రావడం లేదు. మృతదేహంపై పలు చోట్ల గాయాలున్నాయి. వన్‌టౌన్ పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

రెండు రోజుల క్రితం సాగర్ నడుచుకుంటూ వచ్చినట్టు ఫుటేజీ లభించింది. కాగా సాగర్ తల్లి అమ్మాయి తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, అతని మృతిలో భార్య, అత్తంటి వారి ప్రమేయం ఉన్నట్టు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య ఘటన స్థలంలో పరిశీలన జరిపారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో వేగం పెంచాలి

● సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఫిబ్రవరి 27: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మార్చి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3 షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని, తాత్కాలిక పార్కింగ్ లాట్స్‌ను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు. శివ భక్తుల కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశించుకున్న ప్రకారం జాతర ప్రారంభ సమయానికి పనులు పూర్తి చేయాలని, ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను నిరంతరం శుభ్రం చేయించాలన్నారు. మానిటరింగ్‌కు సెక్టార్ల వారీగా సంబంధిత అధికారులను నియమించాలని, మున్సిపల్, టెంపుల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతర సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. అవసరం మేరకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, దేవస్థానం క్యూలైన్లు, పరిసర ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, ప్రతీ 100 మీటర్లకు తాగునీటి ట్యాపులను ఏర్పాటు చేయాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, జాతర ప్రాంగణ మొత్తం సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, ఆలయ ఈఈ రాజేష్, ఏఈవో జయ కుమారి, టౌన్ సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

● జాతర ఏర్పాట్లపై నేడు సమీక్ష

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

భూమి నకిలీ పత్రాలు సృష్టించిన ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో భూమి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తంగళ్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ శివారులో 45 సంవత్సరాల క్రితం గుర్రం అంజయ్య కొనుగోలు చేసిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ భూమిని తంగళ్లపల్లికి చెందిన కోడి అంతయ్య ఆక్రమించాలనే ఉద్దేశంతో గుర్రం అంజయ్యను అతడి కుటుంబ సభ్యులను బెదిరించి భూమి కబ్జా చేశాడు. తంగళ్లపల్లి శివారులోని శోభ భూమిలోకి సైతం అక్రమంగా ప్రవేశించినందుకు అతడిపై మరో కేసు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. అదే విధంగా తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్ సర్వే నంబర్ 160లో రెండు గుంటల భూమి తన పేరును లేకపోయినా ఉన్నదని నమ్మించి చిలుక శ్రీనివాస్ అనే వ్యక్తితో ఒప్పందం చేసుకొని అతని వద్ద నుంచి రూ .8.40 లక్షలు తీసుకున్న వట్టిమల్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. భూ కబ్జాలకు సంబంధించి ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ అన్నారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, భూమి నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలన్నారు.

దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27: బీజేపీ దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ మత రాజకీయాలు చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ గజ్జెల కాంతం విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సహించరానివన్నారు. బండి సంజయ్ మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఈ సారి బండి సంజయ్‌కి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందన్నారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తరువాత ఇప్పటి వరకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. రాముడు దేశ ప్రజలందరి ఆరాధ్య దేవుడన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కాగ్ రిపోర్ట్‌లో గత రాష్ట్ర ప్రభుత్వంలో రూ.3 లక్షల కోట్లు అవినీతిపై సీబీఐ, ఈడీ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌తో లోపాయికారి ఒప్పందంతోనే లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితను అరెస్టు చేయటం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవితల అవినీతిపై విచారణ జరపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి



అంజన్న ఆలయం వద్ద భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 27: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. సమ్మక్క సారక్క భక్తుల రద్దీ దృష్ట్యా నిలిపి వేసిన వాహనపూజలు, అభిషేకాలు పునరుద్ధరించారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు (44) బెహరన్ దేశంలో మృతి చెందగా మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. నిమ్మల రాజు గత పదేళ్లుగా బెహరన్ వెళ్తున్నాడు. అక్కడ ఓ కంపనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజు గుండెపోటుతో మృతి చెందాడు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

చొప్పదండి, ఫిబ్రవరి 27: చొప్పదండి జెడ్పి బాలుర పాఠశాలకు చెందిన 13 మంది బాలికలకు ఉమెన్స్ డెవలెప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ మంగళవారం సైకిళ్లను పంపిణీ చేసింది. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జమున, ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, పీడి కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కమలాకర్ (ఫైల్)

బోయినపల్లి, ఫిబ్రవరి 27: బోయినపల్లి మండలంలో ద్విచక్రవాహనాన్ని లారీ అతివేగంగా ఢీకొనడంతో గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన గోదాల కమలాకర్ (45) మంగళవారం అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. గంగాధర మండలం పిట్టలపల్లి గ్రామానికి చెందిన కమలాకర్ కోర్టు కేసు నిమిత్తం వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. బోయినపల్లి మార్కెట్ యార్డు సమీపాన ఇటుక బట్టీల యజమానులు డంప్ చేసిన మట్టి నిల్వలను తరలించేందుకు లారీ వస్తోంది. లారీ డ్రైవర్ వాహనాన్ని అతి వేగంగా కమలాకర్ ద్విచక్ర వాహనాన్ని వెనక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కమలాకర్ లారీ కింద పడి అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని మృతుని కుటుంబసభ్యులను అందోళనను విరమింప జేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తి సిరిసిల్ల జిల్లా అసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చుసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవం

కోరుట్ల, ఫిబ్రవరి 27: పట్టణంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోశ్చరణ మధ్య ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో ఉన్న పాము పుట్ట వద్ద నాగేంద్ర సహిత మానసాదేవి ప్రతిష్ఠాపన జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు.



ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు, వేదపండితులు

సరైన లక్ష్యంతో సత్ఫలితాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

గంభీరావుపేట, ఫిబ్రవరి 27: విద్యార్థులు సరైన లక్ష్యం నిర్దేశించుకున్నప్పుడే సత్ఫలితాలు సాధిస్తారని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వ ప్రధానాచార్యుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని దత్తసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పదో తరగతి ప్రేరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి దత్తసాయి ఫంక్షన్ హాల్‌తోపాటు భోజన వసతి కల్పించిన మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, రా రైస్‌మిల్ అసోసియేషన్, బాయిల్డ్ రైస్‌మిల్ అసోసియేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం మధుసూదన్‌రెడ్డిని అధ్యాపకులు సన్మానించారు.

ఎల్లమ్మ గుట్ట బ్లాస్టింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దు



ఎస్పీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 27: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ఎల్లమ్మగుట్ట బ్లాస్టింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు కోరారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ ఆ గుట్టపై ఆధారపడి కుటుం బాలను పోషించుకుంటున్నారన్నారు. ఇటీవల స్పిన్నింగ్ మిల్లును కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పరిశ్రమలను కూల్చి వేయడంతోపాటు ఎల్లమ్మ గుట్టను సైతం తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. స్పిన్నింగ్ మిల్లును కొనుగోలు చేసిన వ్యక్తులు గుట్ట బ్లాస్టింగ్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకు న్నట్లు తెలిసిందన్నారు. బ్లాస్టింగ్‌లతో ఉపాధి కోల్పోవడంతోపాటు ఇళ్లు సైతం దెబ్బతిని కూలి పోయే ప్రమాదం ఉంద న్నారు. అన్యాయం జరుగకుండా చూస్తానని ఎస్పీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో వడ్డెర సంఘం నాయకులు కనుకయ్య, రాజయ్య, రాజు, బుచ్చయ్య, కనుకయ్య, రమేష్, రవికుమార్, దేవయ్య, నాంపెల్లి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రిపై బండి సంజయ్ విమర్శలు సరికాదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ వీర్నపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

'ఉజ్వల యోజన'తో పేదలకు లబ్ధి

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27 : ప్రధానమంత్రి ఉజ్వల పథకంతో పేదలకు లబ్ధి చేకూరనుందని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి అన్నారు. పథకంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీసాయి వేంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ ద్వారా అర్హులకు మంజూరైన గ్యాస్ సిలిండర్లను మంగళవారం పంపిణీ చేశారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 27: నేతన్నల ఆకలి కేక మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పిలుపు నిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూచన శంకర్, కుడిక్యాల కనకయ్య, అక్కుల శ్రీనివాస్, సామాల నర్సయ్య, అన్నల్‌దాస్ గంగాధర్, జెల్ల సదానందం, ఆడెపు రవి, అంబదాస్, వేణు, సుదర్శన్, వెంకటేష్, వరప్రసాద్, శ్రీధర్, రాజశేఖర్, కిషన్, జనార్దన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చిత్రపటం ఏర్పాటు చేయాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 27: ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం ఏర్పాటు చేయాలని జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. నాయకులు గుగ్గిళ్ల భరత్, గుగ్గిళ్ల రాములు, పర్శరాములు, మునిగెల అంజయ్య, గంగారం, ఆనందం, దేవరాజు, దేవదాస్ తదితరులు ఉన్నారు.

నోరు అదుపులో పెట్టుకోవాలి

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 27 : ఎంపీ బండి సంజయ్ నోటి దురుసుతో అధ్యక్ష పదవి కోల్పోయారని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ అన్నారు. నాగాయపల్లి గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని, ఏం మాట్లాడుతున్నాడో బండి సంజయ్‌కి అర్థం కావడం లేదని అన్నారు. బండి సంజయ్ మాట్లాడే తీరును ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీ బండి సంజయ్‌పై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రంగు వెంకటేశం, బొడ్డు శంకరవ్వ రాములు, నాయకులు సోయినేని కరుణాకర్, వంగపెల్లి మల్లేశం, రొండి రాజు, చిలుక ప్రభాకర్, చల్ల సురేష్, చెరుకు శంకర్, జాగిరి సురేష్, తిరుపతి, దాన వేణు, బత్తిని ఎల్ల గౌడ్, రమణా రెడ్డి, శ్రీకాంత్, రవీందర్, నాగుల మల్లయ్య, పుత్తూరు నర్సయ్య పింగళి, సామాల రేఖలు, అచ్చ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 27 : తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆర్బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్‌రావు, మేనేజర్ హర్షకుమార్ మంగళవారం ప్రారంభించారు. సిరిసిల్ల డిస్ట్రిక్ ఫైనాన్స్ లిటరసీ కో ఆర్డినేటర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ, హ్యూమన్ రైట్స్ లీగల్ అడ్వయిజర్‌గా దినేశ్

ముస్తాబాద్, ఫిబ్రవరి 27: ముస్తాబాద్ మండల ఆర్‌టీఐ, హ్యూమన్ రైట్స్ లీగల్ అడ్వయిజర్‌గా గుడ్ల దినేశ్ నియామకమైనట్లు రాష్ట్ర చైల్డ్ ఉమెన్ ప్రొటెక్షన్ మెంబర్ కుసుమ కవిత తెలిపారు. తన నియామకానికి సహక రించిన మండల అధ్యక్షుడు రాజు, సభ్యులకు దినేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

కళాశాలకు గోడ గడియారాల వితరణ

గంభీరావుపేట, ఫిబ్రవరి 27 : గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అంబేడ్కర్ సంఘం నాయకుడు ఇరిగి భాను ఎనిమిది గోడ గడియారాలను అందజేశారు. ఇంటర్మీడియట్ వార్షిక దృష్ట్యా విద్యార్థులకు సౌకర్యార్థం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్ భానుకు కృతజ్ఞతలు తెలిపారు.

పలువురికి పరామర్శ

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27 : ఎల్లారెడ్డిపేట మండలంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం పలువురిని పరామర్శించారు. రాజన్నపేట గ్రామానికి చెందిన గోగూరి చంద్రారెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన బల్జీ రాములు ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నమిలికొండ శ్రీనివాస్, పందిళ్ల పర్శరాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్ తదితరులు ఉన్నారు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 27 : మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో టౌన్ సీఐ రఘుపతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడై ఉండి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నామని, నోటికొచ్చినట్లు మాట్లాడతామంటే ఊరుకోబోమని అన్నారు. కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లలో బండి సంజయ్ సిరిసిల్లకు కనీసం ఐదు సార్లు కూడా రాలేదన్నారు. అభివృద్ధి పనులు చేయకుండా పాదయాత్రల పేరిట తిట్ల పురాణంతో వస్తున్నారన్నారు. బండి సంజయ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, నాయకులు భీమవరం శ్రీనివాస్, వైద్య శివప్రసాద్, కిరణ్, శ్రీశైలం, అఫాన్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తల్లిని అవమానించేలా ఎంపీ మాట్లాడారంటూ మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి మాట్లాడుతూ బండి సంజయ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు జమాల్, రాజేశం, అంతగిరి బాల పోచయ్య, బదుగు లింగం, కరివెద కర్ణాకర్‌రెడ్డి, కాసుపాక రమేష్, జెట్టి మల్లేశం, ఒగ్గు రమేష్, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, దాసు, బాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, బాబు, రాజయ్య, సాయివర్మ, సురేందర్‌రెడ్డి, నర్సింహం పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మంత్రి పొన్నంపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు నేరెళ్ల నర్సింగం, సుద్దాల శ్రీనివాస్, మందాటి తిరుపతి, గుర్రం రాజలింగం గౌడ్, మీరాల శ్రీనివాస్ యాదవ్, చుక్క శేఖర్, మునిగెల రాజు, గుగ్గిళ్ల శ్రీకాంత్, గుగ్గిళ్ల భరత్, రంగు అంజయ్య, మోర లక్ష్మిరాజం, ముక్క వాసు, ఎడ్మాల ప్రతాప్‌రెడ్డి, ఎగుర్ల ప్రశాంత్, చెన్నమేని ప్రశాంత్, బండి పర్శరాములు, సుద్దాల కరుణాకర్ తదితరలు ఉన్నారు.



సిరిసిల్లలో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎంపీ బండి సంజయ్‌పై స్థానిక కాంగ్రెస్ నేతలలు మంళవారం పిర్యాదు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు గౌడ్, ఎంపీటీసీ పర్శ రాములు, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు మల్యాల రాజవీర్, లక్ష్మీనారాయణ, స్వామి, ప్రభాకర్, జంగం రాజులు, రాజుగౌడ్, బాబురావు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: మతంపేరుతో ఎంపీ బండి సంజయ్ రాజకీయం చేస్తున్నారని ముస్తాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం బండి సంజయ్‌పై పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం పొన్నం ప్రభాకర్ ఎంతో చేశారన్నారు. ఐదేళ్లలో బండి సంజయ్ ఎంపీగా చేసిందేమీ లేదన్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మెర్గు యాదగిరిగౌడ్, ప్యాక్స్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు శీల ప్రశాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తలారి నర్సింలు, యారటి కరుణాకర్ , గాంత రాజు, దునుకుల కొండయ్య, కొమురయ్య, రంజాని నరేశ్, కొప్పు రమేశ్, వెల్మల రాంరెడ్డి, ఉచ్చిడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ బండి సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శులు లింగంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

వేములవాడలో..

వేములవాడ: ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను మంగళవారం వేములవాడలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ స్థానిక తెలంగాణ చౌక్ వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను పట్టణ కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, కనికరపు రాకేష్, చిలుక రమేష్, పులి రాంబాబు, పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ అన్నారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పిర్యాదు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, గొట్టె ప్రభాకర్, భీంరాజు కనకరాజ్, ఇందూరి మధు, బాలు,పులి సత్యం, దూది శ్రీనివాస్, అవారి రమేష్, రామ చంద్రం, హరీష్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంపీ బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, బీసీ సెల్ అధ్యక్షుడు గండి నారాయణ, చెలుకల తిరుపతి, పల్లి గంగాధర్, సిరికొండ రవీందర్, తర్రె లింగం, గంధం మనోజ్, అక్కినపెల్లి శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. కోనరావుపేటలో మంగళవారం విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు బుర్ర రవీందర్, తాళ్లపల్లి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



వేములవాడలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



తంగళ్లపల్లిలో..



గంభీరావుపేటలో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డంపింగ్ యార్డు నిర్వహణపై నిర్లక్ష్యం



కోనరావుపేటలో నిరుపయోగంగా డంపింగ్ యార్డు

కోనరావుపేట, ఫిబ్రవరి 27 : పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉండాలని, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో డంపింగ్ యార్డుల నిర్మాణం చేపట్టింది. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. కానీ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారుతున్నాయి. కోనరావుపేట మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా ప్రతీ పంచాయతీకి ఒక డంపింగ్ యార్డును నిర్మించింది. గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకి తరలించి తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో ఎరువులను తయారు చేసి రైతులకు అందించాల్సి ఉంటుంది. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేయకుండా డంపింగ్ యార్డు పక్కనే పడేస్తున్నారు. పడేసిన చెత్తను తగులపెట్టడంతో వాతావరణ కాలుష్యం కాకుండా పొలాల వద్ద నిర్మించిన డంపింగ్ యార్డులతో మెరుగులు పడి పంటలు అంటుకొని కాలిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చేపట్టిన డంపింగ్ యార్డు పనులు కొన్ని రోజులుపాటు సాఫీగా సాగాయి. తడి, పొడి చెత్తను వేరుచేసి తడి చెత్త ద్వారా తయారు చేసిన ఎరువులను రైతులకు అందించడంతో గ్రామపంచాయతీకి ఆదాయం కూడా చేకూరింది. రానురాను ఈ ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ పక్కన పడేసి వదిలేస్తున్నారు. సర్పంచుల పదవీ కాలం ఈ నెలలో ముగియడంతో గ్రామ పంచాయతీ బాధ్యతలు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి అప్పజెప్పింది. ఈ అధికారుల పాలనలోనైనా చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేయాలని, కంపోస్టు ఎరువును తయారుచేసి రైతులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



డంపింగ్ యార్డు పక్కన పడేసిన చెత్త

విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27: ఇంటర్‌మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని అధికారులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఆదేశించారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు బస్సు ఆపమన్న చోట ఆపాలని, పరీక్షా కేంద్రాల వద్ద బస్సు ఎక్కే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు ఇంటర్‌మీడియట్ పరీక్షలు బాగా రాసి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

భూ తగాదాతో ఒకరిపై ఒకరు దాడి

చందుర్తి, ఫిబ్రవరి 27: చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో భూ తగాదా నేపథ్యంలో ఇద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన అంజయ్య, లచ్చయ్య అనే ఇద్దరు బండపల్లి గ్రామంలో వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు. మంగళవారం అంజయ్య వ్యవసాయ భూమిలో బోరు వేస్తుండగా హద్దుల విషయంలో గొడవ తలెత్తింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయాల పాలయ్యారు. ఇరువురు ఒకరిపై ఒకరు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

దేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిన మోదీ

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 27: భారత కీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూలల విస్తరించేలా సుపరిపాలన అందిస్తున్నది ప్రధానమంత్రి నరేంద్రమోదీనేనని బీజేపీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని విజయ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు వెళ్తుండగా మంగళవారం మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలతో ప్రపంచంలోనే 5వ బలమైన ఆర్థిక దేశంగా భారత్ ఎదిగిందన్నారు. కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలను అంతం చేసే దిశగా మోదీ నిర్ణయాలు ఉండబోతున్నాయన్నారు. ఏళ్ల నుంచి పరిష్కారంకాని ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, రామ మందిర నిర్మాణాలు వంటి ప్రధాని మోదీ చేసి చూపారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందంతో పని చేస్తున్నాయన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే హామీలు నెరవేరుతాయని నమ్మబలుకుతూ గ్యారంటీలతో అబద్ధాలు ఆడుతున్నారన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 27: సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, నిధుల మంజూరులో చొరవ చూపిన కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 కోట్లలో సిరిసిల్ల మున్సిపల్ అభివృద్ధి పనులకు రూ. 2 కోట్లు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, కార్యదర్శి కాసర్ల రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, నాయకులు వైద్య శివప్రసాద్, స్వర్గం రాజు, రఫీ, అస్లాం, శ్రావణ్, కృష్ణ, అఫాన్, కిరణ్, ఇమ్రాన్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి ప్రకాష్

కోనరావుపేట: కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం రూ.79 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ జిల్లా నాయకుడు కచ్చకాయల ఎల్లయ్య మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా కోనరావుపేటలో విలేకరులతో మాట్లాడారు. ఈ నిధులు కుల సంఘాలు, మహిళా సమైక్య భవనాలకు, తాగునీటి సమస్య, నూతన బోరుబావులకు, మోటార్లు వంటి అభివృద్ధి పనులకు మంజూరైనట్లు తెలిపారు. మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉత్తమ్‌కుమార్ రెడ్డికి, పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి

సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది మరొకటని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ జీవో తీసుకొస్తే రేవంత్‌రెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాద్ధాంతం చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 8 వేల కోట్ల ఆదాయం కోసం ఎల్ఆర్ఎస్‌ను తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఎల్ఆర్ఎస్ ద్వారా మున్సిపల్, కార్పొరేషన్, గ్రామాల్లో లేఅవుట్‌లేని భూములను రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25.44 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కొందరు కోర్టుకు వెళ్లి స్టే తీసుకరావడంతో 25 శాతం మంది దరఖాస్తులు హైకోర్టు సూచనలకు అనుగుణంగా రెగ్యులరైజ్ చేసుకున్నారన్నారు. ఇదే సమయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర పదజాలంతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామన్నారని, ఇప్పుడు రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని రెగ్యులరైజ్‌ను కొనసాగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలబడడం లేదన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ పేదల సమస్యల పరిష్కారం కోసం ఎల్ఆర్ఎస్ జీవో తెచ్చారని, పాత జీవో ప్రకారమే భూములను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. రెగ్యులరైజ్ పేరుతో పేదల వద్ద డబ్బులు వసూలు చేయవద్దన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్‌మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రామ్మోహన్, మ్యాన ప్రసాద్, రాజిరెడ్డి, జక్కుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ కవచం

వేములవాడ: తెలంగాణ రాష్ట్రానికి గులాబీ జెండానే రక్షణ కవచమని శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన పొరపాట్లను అంచనా వేసుకొని ముందుకు వెళ్దామన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను వద్దనుకోలేదని, బీఆర్ఎస్ సజీవంగా ఉండి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరుకుంటున్నారని అన్నారు. అందుకే 39 సీట్లతో చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఇంత పెద్ద బలమైన ప్రతిపక్షంగా పనిచేసే అవకాశం ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి ఎవరి శిష్యుడో అందరికీ తెలుసని, ఆయనకు ఓనమాలు నేర్పిన చంద్రబాబు నాయుడికే మూడు చెరువుల నీళ్లు తాగించామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కుర్చీని కాపాడుకోడానికి సమయం సరిపోతుందని, పార్లమెంట్‌లో కనీస ప్రతిపక్ష హోదా దక్కని రాహుల్ గాంధీ చచ్చిన పామని అన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ పార్టీకి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ పార్టీకి కార్యకర్తలేనని, ప్రజల పట్ల ప్రేమాభిమానంలో నడుచుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 24 గంటలపాటు విద్యుత్ సాధించామని, 120 అంతస్తుల పైన ఉన్న తెలంగాణకు గోదావరి నీటిని తరలించామని, కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చామని అన్నారు. 86 పిల్లర్లు ఉన్న కాళేశ్వరంలో రెండు పిల్లర్లు కుంగితే ఎందుకు రిపేరు చేస్తలేరో ఆలోచించాలని, ఇది కొట్టుకపోతే కింద చంద్రబాబుకు నీళ్ల అందాలని చూస్తున్నారని అన్నారు. 5000 క్యూసెక్కుల నీటిని సముద్రానికి వృథాగా పంపిస్తున్నారన్నారు. మార్చి 1న కాళేశ్వరంను పరిశీలిద్దామని, నిజాన్ని ప్రజలకు వివరిద్దామని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్ పర్సన్ అరుణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, లోక బాపురెడ్డి, ఏనుగు మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.